ఆంధ్రప్రభ (27.12.61)

# అతను

సాయంత్రం నాలుగు గంటలైంది.

సాధారణంగా నేనాపాటికి డిస్పెన్సరీకి వెళ్లవల్సిందే కాని అతనికోసం ఆగిపోయాను. అతను గదిలో నిద్రపోతున్నాడు.

నవలొకటి తీసి చదువుతూన్నాను. మల్లెపందిరి కింద మత్తుగా ఉంది. ఇన్నాళ్లుగా ఉన్న ఆసక్తి గ్రంథపఠనంలో తగ్గిపోయింది. ఏదో మధురాలోచనలు పుష్ప సౌరభంతో జోడై మస్తిష్కాన్ని ముప్పిరిగొంటున్నాయి. నాకేదో గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది. చిన్నగా కులాసాగా నవ్వుకున్నాను. నా ఊహాగానాలకు నాకే సిగ్గేసింది. ఒక మల్లియ ప్రక్కనే ఉన్న

నీళ్ళ తొట్టెలో తన అందం చూసుకుంటూంది!

పలకరింపులతో పుస్తకంపై మనసుపోక చెక్కిలికి చేయి చేర్చి మల్లె కన్నియల వైపే కన్నార్పకుండా చూస్తున్న నాకు ఎవరిదో అడుగుల చప్పుడై ప్రక్కకు చూశాను. తెచ్చి పెట్టు కుంటున్న చిరునవ్వుతో శకుంతల వస్తూంది.

గబుక్కున పైకి లేచి శకుంతలకు ఎదురు వెళ్ళి "ఎన్నాళ్లకు వచ్చావ్ శకూ!" అని ఆమెను కౌగలించుకున్నాను. నా ఆనందం నాకే ఆశ్చర్యం కలిగించింది.

నా బుగ్గపై చిన్నగా కొట్టి, "ఓసీ అభిసారికా! నువ్వు డాక్టరు కావలసినదానివి కాదే!" అంది శకుంతల. ఇద్దరం చెయ్యి చెయ్యి పట్టుకొని మల్లె పందిరి క్రిందకు వచ్చి కుర్చీల్లో ఆసీనులమయ్యాము.

"మీ కన్యాశ్రమం విశేషాలేమిటి?" అని అడిగాను నవ్వుతూ. ఏమిటో ఊహకందని ఆనందానుభూతి నన్నశక్తురాలను చేస్తూంది.

"మామూలే! ఈ మధ్య ట్యుటోరియల్ కాలేజీలో డిగ్రీ క్లాసెస్ కూడా పెట్టించాను. నాకు మట్టుకు పిల్లలతో రోజులు ఆనందంగానే గడిచిపోతున్నాయి. ఒకసారి నిన్ను చూసినట్లూ ఉంటుంది, ఇక్కడ మేడల అద్దె డబ్బు వసూలు చేసుకున్నట్లూ ఉంటుందని వచ్చాను. అది సరే, ఈపాటికి రోజూ హాస్పిటల్లో అంటూ తపించే దానివి. ఇవ్వాళ ఇంకా వెళ్ళలేదేమే? మీ హాస్పిటల్‌కు ఫోన్ చేసి నువ్వింకా రాలేదని తెలిసే నేనిట్లా వచ్చాను" అంది శకుంతల.

"అదే నీకు చెప్పబోయేది. మొదటినుంచీ చెప్పాలి" అని ప్రారంభించాను.

రెండు నెలలనాడు.....

ఒక రాత్రి విపరీతంగా వర్షం కురుస్తూంది. సాయంత్రం చీకటి పడే వరకు డిస్పెన్సరీ నుంచి ఇంటికి వెడదామంటే పేషంట్సుతో సరిపోయింది. అప్పటికే వర్షమారంభమైంది . బాధ్యతలన్నీ నర్సుల కప్పచెప్పినా నాకా రాత్రి ఇంటికి వెళ్ళబుద్ధికాలేదు.

ఆకలిగా లేకపోవటంతో ఇంటికివెళ్ళే ఉద్దేశ్యం ముందే విరమించుకున్నాను. రాత్రి పదకొండు దాటినా ఎంతసేపటికీ నిద్రపట్టలేదు.

ఏమిటో ఒంటరి బ్రతుకు అని బాధ కలుగుతుంటుంది అప్పుడప్పుడు. ఏదో నన్నింతవరకు చదివించాడన్నమాటే కాని మా అన్నయ్య ఎప్పుడో కాని రానే రాడుకదా! సంసారమేమిటో, వ్యాపారాలేమిటో అదే ప్రపంచం వాడికి.

ఒక్కొక్కసారి తోటి మానవులందరితోను జీవించే నాకు ఒంటరితనమెక్కడిది అని ధైర్యం తెచ్చుకుంటూంటాను. రోగులకు డాక్టరుగా గాక, ఆత్మీయురాలుగా సలహా ఇస్తుంటాను. పేద గొప్ప భేదం లేకుండా వైద్యం చేస్తూంటాను. ఈ విషయాలు నాకెనలేని ధైర్యాన్ని, ఆనందాన్ని ఇస్తాయి. కాని, ఇంత గౌరవప్రదమైన జీవితాన్ని ఆర్థికంగాను, నైతికంగాను అనుభవిస్తున్నప్పటికి నాలో ఒక మూల దురూహ్యమైన వెలితి తలెత్తుతూంది. అదేమిటో అహంభావంతో ఇంకొకరి దగ్గరైతే ఒప్పుకునేదాన్ని కానేమో కాని నీతో చెప్పకుండా

ఉండగలనా శకూ?

గత జీవితంలో ఎన్నో కల్లబొల్లి కబుర్లు చెప్పి చివరకు స్వార్థపరుడైపోయిన శేఖర్ జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా నాకు మగజాతిమీదే ఏహ్యాభావం పుడుతుంది. నీకా విషయం తెలుసుగా శకూ! ఈ నాలుగేళ్ళుగా ఏదో యాంత్రిక జీవితానికైతే అలవడిపోయానే కాని, నా జీవితం గురించి నిర్దిష్టంగా ఆలోచించుకోవటం ప్రారంభించి ఇప్పుడే! నా మనసులో మల్లెల సౌరభాన్ని సృష్టించగల పురుష హృదయం నాకు తోడు కావలి అని నిశ్చయించుకున్నాను. కాని అదెట్లా సాధ్యం? తిరిగి శేఖర్ గుర్తుకు వచ్చి ఆ కోర్కె అణిగిపోయేది. ఇట్లా వైవిధ్యపుటాలోచనలతో విశ్రాంతి కాలం అవిశ్రాంతిగా గడిచిపోతుంది.

ఆ రాత్రి ఇవే ఆలోచనలతో నిద్రపట్టక బయట వరండాలోకి వచ్చాను. ఇంకా వర్షం కుండపోతగా కురుస్తూనే ఉంది. చలిగాలి రివ్వున వీస్తూంది. అయినా నాకు చలి అనిపించ లేదు. కారుచీకటిలో అప్పుడప్పుడు మెరుపులు మాత్రం చైతన్య ప్రకృతిని గుర్తు చేస్తున్నాయి.

ఒకసారి మెరుపు వెలుగులో వరండాలో చివరగా నిలబడిన వ్యక్తిని చూశాను. వర్షపు జల్లు మీద పడుతున్నా అతనట్లా చలించకుండా అక్కడే ఉండటం నాకాశ్చర్యం కలిగించింది.

"ఎవరది?" అని రెండుసార్లు కేకవేసినా అతను కదలలేదు సరికదా పలకలేదు.

శకూ! జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన గురించి మనం ఆలోచించలేము. అట్లా ఆలోచించగలిగేటందుకు, దాని నుండి వాస్తవికతను గ్రాహ్యం చేసుకునేటందుకు ఈ జీవితకాలం చాలదేమో! కాని, ఒక్కొక్కప్పుడు దొరికిన స్వల్ప వ్యవధే ఆ అవకాశాన్నిస్తూ ఉంటుంది. అందులో సహజత్వం ఉన్నచోటనే ఆలోచనకు తావెక్కువ.

అట్లా వర్షం మీద పడుతున్నా చలించని వ్యక్తి మన: ప్రవృత్తి ఎటువంటిదో తెలుసుకోవలనే కోర్కె నాలాటి డాక్టర్లకు కలగటంలో ఆశ్చర్యం లేదుగా! గోడవారమ్మటే అతన్ని సమీపించి మళ్ళీ పిలిచాను. అయినా అతను కదలలేదు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నాకు తెలియకుండా అక్కడో శిలాప్రతిమ ఎట్లా ఉందా అన్న భ్రాంతి కూడ కలుగకపోలేదు.

"ఎవరండీ మీరు?" అని అతని ఒంటి మీద చెయ్యి వేసి షాక్ తగిలినట్లు వెనక్కు తీసేశాను. నూటమూడు డిగ్రీల జ్వరం తక్కువ ఉండదు. ఏ అద్భుతశక్తితో అతనట్లా చైతన్య రహితంగా నిలబడగలిగాడో నన్ననప్రతిభురాల్ని చేసింది.

అతను తల ప్రక్కకు తిప్పి నావైపు చిత్రంగా చూశాడు. అటువైపు ఎలక్ట్రిక్ బల్బు మాడిపోయింది కాబోలు! అక్కడ చీకటిగా ఉంది. అతని ముఖకవళికలు మెరుపు వెలుగులో మాత్రం చూచాయగా స్టడీ చేశాను.

"ఇట్లా జ్వరంతో వర్షంలో తడుస్తున్నారేం?" అని అడిగాను మందలింపుగా.

అతను మాట్లాడలేదు. నేను మరీ ఆశ్చర్యపోయాను. వరండాలోకి వచ్చిన నర్సును పిలిచాను. ఇద్దరం అతని చేతులు పట్టుకొని నడిపించుకు వెళ్ళాము. అతనేమనుకున్నాడో మాట్లాడలేదు. ఒక ఖాళీ గదిలోకి తీసుకువెళ్ళాము. లైటు వెలుగులో అప్పుడతన్ని

పరికించాము.

మాసిన పాంటు, షర్టు, మాసిన గెడ్డం, చేతిలో ఫ్లూటు - పిచ్చి పట్టిన గాయకుడులా, చరిత్రహీనుడైన కళాకారుడులా అతను నాకు కనిపించాడు. ముప్పయ్యేళ్ళకన్నా ఎక్కువ ఉండవు.

"ప్రాణాలు తీసుకోవటం సులువైన పనికాదు మిస్టర్!" అన్నాను నేను.

"డాక్టర్! గుడ్డి కన్ను మూస్తే ఎంత? తెరిస్తే ఎంత?" అదీ అతని సమాధానం.

"అట్లాగని కాలం తీరినవాళ్ళకు కూడా రోగాలు వస్తే వేలు ఖర్చు పెట్టడం మానుతున్నామా?"

"అనురాగం, ఆదరణ ఉన్నచోట మానవుడు బ్రతకాలనుకుంటాడు. అవి లేని చోట జీవితం దుర్లభం."

అతని పెసిమిస్టిక్ వాదాన్ని నేను వినదలుచుకోలేదు. ఈలోపల నర్సు బెడ్ సిద్ధం చేసింది.

"అట్లా కూర్చోండి. ఈ విషయం గురించి తర్వాత మాట్లాడవచ్చు."

"నా దగ్గర డబ్బు లేదు డాక్టర్!"

"మీకు వైద్యం చేసినంత మాత్రాన నా డబ్బు తరిగిపోదులెండి."

అతను బాధగా నవ్వాడు. "డాక్టర్! నేనంటే మీకెందుకింత దయ? నేననాథుడిని. దేశ ద్రిమ్మరిని. మీరెన్నో వేలుపోసి సంపాదించిన ఈ డిగ్రీని నా వంటి అనామకుల ప్రాణాలు కాపాడటానికేనా? మీరెంత దయకలవారైనా ఉచిత వైద్యం చెయ్యవచ్చు. కాని, మందులు కూడా ఎట్లా తెస్తారు?"

"నా దగ్గరున్నాయి."

"నా వంటి వాళ్ళకెంతమందికని ఇట్లా చికిత్స చేస్తారు? మీరెంత డబ్బుకలవాళ్ళయితే మాత్రం ఇది ఎంతకాలం సాగుతుంది? ధర్మబుద్ధి మహాచెడ్డది. దానిని దగ్గరికి రానివ్వకండి డాక్టర్! వచ్చిందా, ఏదో యూనివర్సిటీ డిగ్రీలు వచ్చినట్టే కీర్తి పట్టా రావచ్చునేమో కాని తర్వాత వ్యక్తిగత గౌరవం సమూలంగా నాశనమైపోతుంది."

అతను జ్వరతీవ్రతమీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడేస్తున్నాడు. నేనది పట్టించుకోదల్చుకోలేదు. బలవంతాన పడుకోపెట్టి ఇంజక్షను చేశాను. నర్సుతో అతని బట్టలు మార్చి నిద్ర పట్టేవరకు వేచి ఉండమని చెప్పి నా గదిలోకి వచ్చేశాను.

ఆఫీసు రూమ్‌లో కర్టెన్ చాటున ఉన్న బెడ్‌మీద పడుకున్నాను. అతని మాటలే మాటి మాటికి గుర్తుకు వస్తున్నాయి. చిన్నగా నవ్వుకున్నాను. చెప్పదలచుకున్నదానిపై సూటిగా మాట్లాడే అతని తత్వం నన్నిట్టే ఆకర్షించుకుంది. బహుశా నిద్రపట్టేసరికి ఒంటిగంట అయి ఉంటుంది.

తెలతెలవారుతుండగా నాకు మెలకువ వచ్చింది. ఎక్కడి నుంచో ఫ్లూటు వాయిద్యం వినపడుతూంది. ఏదో మధురగానమాలాపిస్తున్నాడు గాయకుడు. వెంటనే లేచి ఆ గానం వినపడేవైపు వెళ్ళాను.

ఆ గాన మాధుర్యం తేనె సోనలై అతని గది లోంచే శ్రోతల నచేతనుల్ని చేస్తూంది. రాత్రి అతని చేతిలో చూసిన ఫ్లూటు జ్ఞప్తికి వచ్చింది. నా పాదాలు వేగాన్ని పుంజుకుని అతని గదిని చేరాయి. చిదానంద స్వరూపుడైన యోగిలా ద్వారం వైపు చూసి ఎదురుగా ఉన్న పూల తోటలోకి చూస్తూ మదురగాన మాలాపిస్తున్నాడతడు. నా డిస్పెన్సరీలోని చాలామంది తమ పనుల మాట కూడా మరిచి అతని గాన ప్రవంతిలో మునిగిపోవటం నాకు మొదట ఆశ్చర్యం కలిగించింది. పబ్లిక్ బజారులో కచేరీలా ఇదేమిటని మందలిద్దామని వచ్చిన నేను కూడా అతని అమరగానంలో లీనమైపోయాను.

శకూ! మనం ఇంటర్ చదివేటప్పుడు సునంద అనే అమ్మాయి వీణ బాగా వాయించేది – గుర్తుంది కదూ! ఆమె తన గాన మధురిమతోనే మన హృదయాల నాకట్టుకుంది. మశూచి వచ్చి చనిపోయిందే కాని, మన హృదయాలలో ఆమె తోటి అనుబంధం చెరిగిపోలేదు. సాధారణంగా చెవుల కింపైన సంగీతం వినిపించినప్పుడల్లా సునంద గుర్తుకు వచ్చి నా కన్నుల నీరు గిర్రున తిరుగుతూంటుంది.

డాక్టర్ల హృదయాలు పాషాణాలని కొందరి దురభిప్రాయం. కాని, వాళ్ళల్లో దాగి ఉన్న కరుణా సముద్రము ఎప్పుడో హృదయాల్ని చీల్చుకొని ప్రవహిస్తుందని వాళ్ళకు తెలియదు. ఆ స్థైర్యం లేకపోతే రోజూ ఇంతమంది రోగుల బాధలు వింటూ వాళ్ళకు చికిత్స చెయ్యటం కష్టమే. నేను నమ్మకముంచుకున్న ఏదో ఒక కేసు అట్టర్ ఫెయిల్యూర్ అయితే తప్ప చలించను. అప్పటికీ నా ప్రయత్నం నేను చెయ్యగలిగాను కదా అని సరిపెట్టుకుంటాను. అయినా, అటువంటప్పుడు చాలా రోజుల దాకా ఆ బాధ తగ్గదు.

కాని, డాక్టర్‌గా జీవితం ఆరంభించాక వైద్యానికి సంబంధించిన వాటిలో విచిత్రానుభూతితో నా శరీరం గగుర్పొడిచి కళ్ళ వెంట నీళ్లు తెప్పించినది అతని గానమొక్కటే! అలా ఎంతసేపు గుమ్మంలో నిలబడిపోయానో నాకే తెలియదు.

"డాక్టర్!" అన్న అతని పిలుపు విని ఉలిక్కి పడ్డాను.

"మీకూ కళ్ళనీళ్ళు తెప్పించిందా నా పాట? క్షమించండి డాక్టర్!" అన్నాడతడావేదనతో. అంతవరకు నా కంటతడి మాట నేను గ్రహించనే లేదు.

కళ్ళు తుడుచుకుని, "డజన్ట్ మేటర్! ఇప్పుడెల్లా ఉంది?" అని అడిగాను.

"నా ఫ్లూటు చెప్పలేదూ?" అని అడిగాడు చిన్నగా నవ్వుతూ.

నేను తెల్లబోయాను. అతని మాటల్లో చొరవ, నిగూఢభావుకత, ఉదాత్తత, ఉపజ్ఞ నన్నప్రతిభురాల్ని చేశాయి. వెంటనే మాట్లాడలేకపోయాను.

"నేను తప్పుగా మాట్లాడితే క్షమించండి డాక్టర్! కాకులు కలకాలం జీవిస్తూంటాయి. నా ప్రాణమంత సులువుగా పోదెలెండి. ఇంకా మీవంటి వారల అమూల్య కాలవ్యవధిని ఎంత వృథా చేయవలసి ఉందో?"

"ఆత్మను కించపరచుకోవటమంత నీచత్వం మరొకటి లేదు. నగర వాసుల నాగరకతలోని

నిజానిజాలు తెలియక తానేదో క్షుద్రజీవిగా బాధపడే పల్లెవాసిలో ఎంత అవివేకముందో మీ మాటల్లో అంత ఆత్మనింద ఉంది. వ్యక్తిగా మనగలవారి కుండవలసినది ఆత్మగౌరవం కాని ఆత్మనింద కాదు. నల్లగా ఉన్నంత మాత్రాన దూరాన ఉన్నప్పుడది కాకిలా కనిపించినా దగ్గరకు వెళ్ళాక కోకిలగా గుర్తించి వాళ్ళే పశ్చాత్తాప పడతారు. చేతులారా అవకాశ దుర్వినియోగం చేసుకోవటమంత అసమర్థత మరొకటి లేదు. ఇది స్నేహభావంతోటే చెప్తున్నాను కాని, మరొకలా తలచకండి." అనుకోకుండా అతనితో ఎట్లా మాట్లాడగలిగానో! నాకు ఆశ్చర్యమూ కలిగింది - సంతృప్తీ కలిగింది.

అతడు గాఢంగా నిట్టూర్చి "అవును. జీవించటం చేతకానివాళ్ళే వేదాంతం మాట్లాడతారని మీరే కాదు అనేకమంది అనుకుంటారు. కాని, అగ్ని పర్వతం బ్రద్దలై లావా ఎగజిమ్మి చల్లారిపోతున్నప్పుడు హృదయంలో కలిగే ఆవేదనే ఇట్లా నైరాశ్య జీవితాన్ని ప్రతిబింబింప చేస్తుందని ఎంతమంది అనుకోగలరు? పేషంట్లతో కూడ అత్యాదరణ చూపి మాట్లాడే మీవంటి వాళ్ళొకళ్ళో ఇద్దరో ఇటువంటి నికృష్టజీవుల్ని చూసి సానుభూతి చూపుతారేమో! కాని, నా అనేవాళ్ళున్నా లేనట్లే అయి బ్రతికున్నవాళ్ళు చచ్చిపోయినట్లే ప్రచారం చేస్తారు. ప్రపంచం నమ్మినదానిని అబద్ధం చేయటంకంటే నిజం చెయ్యటం ఘనత కదూ!" అన్నాడు.

"బాధలో పాలు పంచుకోలేకపోయినా కనీసం సానుభూతి అయినా చూపగలిగేవారికోసం జీవితంపై మమకారం పెంచుకోవాలిగాని, విరక్తిభావంతో వేరొక హృదయంలో చిచ్చు రగిలించకూడదు."

"అటువంటి ఆత్మీయులు లేనప్పుడు?"

అతని ప్రశ్నకు నేను చలించిపోయాను. అతని కళ్ళు నన్ను గ్రుచ్చి గ్రుచ్చి చూస్తున్నాయి.

"జీవితాన్ని ప్రేమించలేనినాడు మనము దేన్నీ ప్రేమించలేము."

అతను పేలవంగా నవ్వాడు. "ప్రేమ! జీవితం కంటే ఎక్కువగా ప్రేమించినవాళ్ళు ఈ జీవితాన్ని గడ్డిపరక క్రింద తీసిపారేశారు. ఇక దీనికి విలువ ఎక్కడిది? డాక్టర్! నేనొక అనామకుడిని. అయినా మీరెంతో టైము వృథా చేసి నాతో మాట్లాడారు. నాకు మీ మాటలే క్రొత్త జీవం పోశాయి. నాకు విపరీత జ్వరంరావటం మామూలే! మీ రనవసరంగా శ్రమ పడ్డారు. కాని తెల్లవారేసరికి మాయమైంది. మీ ధర్మగుణానికి నా కంటే వయస్సులో మీరు చిన్నవారయినా నమస్సులర్పించకుండా ఉండలేను. మీ భావాలయితే పవిత్రమైనవి. స్వానుభవంతో కాని నా మాటలు మీ కర్థం కావు. ఇక అవిశ్వాసంగా మీ అమూల్య కాలాన్ని వృథా చెయ్యలేము. సెలవు తీసుకుంటాను" అని అతను లేచాడు.

నేను తెల్లబోయాను. "ఎక్కడికి?"

"ప్రపంచం చాలా విశాలమైంది డాక్టర్!" నేనాశ్చర్యంలోంచి తేరుకునే లోపలే అతను బయటకు వెళ్ళిపోయాడు. అతని నమస్కారానికి ప్రతి నమస్కారం చేసే చైతన్యం కూడా కోల్పోయాను.

శకూ! అతని మాటలు నన్ను సమూలంగా కదిలించివేశాయి. అతను వెళ్ళిపోతూంటే ఎవరో ఆత్మీయులు దూరమైపోతున్నట్టు అనుభూతి చెందాను. అతన్ని వెనక్కు పిలుద్దామనుకున్నాను కాని, డిస్పెన్సరీలో అంతమంది ఎదుట ఎందుకని అతడు ప్రశ్న వేస్తే నేనేం చెప్పగలను? అంతవరకు ముఖమైనా కడుక్కోకుండా అతనితో మాట్లాడుతూ ఉండటం నర్సులు వాళ్ళు చూసి ఏమనుకుంటారోనన్న సంశయం ఆ ప్రయత్నాన్ని విరమింపజేసింది. గాఢంగా నిట్టూర్చి బాత్‌రూమువైపు వెళ్ళిపోయాను.

రోజంతా యాంత్రికంగా ప్రతి పనీ చేసుకుపోతున్నానన్నమాటే కాని అతని మాటలు చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. చిన్నతనం నుంచి చీకూ చింతా లేని జీవితం అనుభవించిన నాకు ఒకళ్ళ బాధలు వినటమే కాని స్వానుభవంతో తెలిసింది లేదుగా! అతడెంత వ్యధిత హృదయుడు కాకపోతే నాతో అట్లా మాట్లాడతాడు? అతని జీవితంలోకి తొంగి చూడాలని ఎందుకో అనిపించింది. శారీరకమైన రోగాలనైతే నేను కొన్ని గంటల్లో, రోజుల్లో నయం చేయగలుగుతున్నాను. కాని, మానసిక రోగుల్ని బాగు చేయటంలోనే నా గొప్పతనం, సంతృప్తి ఇమిడి ఉంటాయి. ఈ విషయం గురించి ఆలోచించటానికెప్పుడైనా టైముంటేగా? కాని అతన్ని తిరిగి కలుసుకొని అతని హృదయాన్ని స్టడీ చేసి తిరిగి ఒక వ్యక్తిగా రూపొందించాలని మనస్సులో అనుకున్నాను.

ఆనాడు సాయంత్రం అతనెక్కడైనా కనకపడకపోతాడా అని నా కారు డ్రైవ్ చేసుకుంటూ టౌనంతా తిరిగాను. కాని ప్రయోజనం లేకపోయింది. నిరాశగా డిస్పెన్సరీ చేరేసరికి ఏడు గంటలైంది..... అయినా నాలో ఆశ క్షీణించలేదు. వారం రోజుల వరకు నా దినకృత్యాల్లో... అతన్ని గురించి అన్వేషణ ఒక భాగమైంది. ఏమిటీ మనో వైకల్యం? అతను నాకేమైనా ఆత్మీయుడా? అతన్నే ఎందుకు స్టడీ చేయాలనుకుంటున్నాను?.. ఇట్లా ఎన్ని ప్రశ్నలు వేసుకున్నా సమాధానం శూన్యం. అయినా, నా ప్రయత్నం విరమించుకోలేకపోతున్నాను. బహుశా అతని అయిడియలిజమ్ నన్ను ఆకట్టుకుని ఉంటుంది. అతని భావాల్లో ఒక వింత ఆకర్షణ నన్నాకర్షించుకొని ఉంటుంది. ఇంతకన్న సమాధానం చెప్పుకోలేకపోయాను. రోజు రోజుకూ అతను అజ్ఞాతంగానే నా హృదయ మాక్రమించుకుంటున్నాడు.

అందని ద్రాక్షపళ్ళు చేదనుకునే మనస్తత్వం కాదుగా నాది! ఆ నిరీక్షణలోని సహనశక్తి నాకు లేకపోతే ఈ జీవితాన్నిట్లా నిర్వహించగలనా?

'వర్క్ యీజ్ దై డ్యూటీ, బట్‌ఫ్రూట్ ఈజ్ నాట్ దై కన్సర్న్..." డాక్టర్ అహల్య నా ఆటోగ్రాఫ్‌లో వ్రాసిన మాటలు నా యీ ప్రయత్నంలో నిజమయ్యాయి.

అప్పటి కతను కనిపించి నెలరోజులైంది. ఒకనాడు సాయంత్రం ఇంటి నుండి డిస్పెన్సరీకి వెడుతూ పార్కులో మూగిన జనాన్ని చూసి కారు స్లో చేశాను. ఆ గుంపు మధ్యనుంచి ఫ్లూటు గానం వినవస్తూంది. అనుకోకుండా కారు ఆగిపోయింది. అతని గాన మధురిమ నన్ను బయటకు లాక్కువచ్చింది. పార్కులోకి నడిచాను.

అతనే! తన ఇంద్రజాలంతో అందర్నీ అచేతనుల్ని చేసివేశాడు. అతను జనం వెనుకనున్న నన్ను గుర్తు పట్టలేదు. అతని ముందు చాలా మంది చిల్లర డబ్బులు పడవేసినట్లున్నారు. ఎందుకో మనస్సు చివుక్కుమంది. వీధిలో పాటలు పాడి డబ్బు సంపాదించే ఆ ముష్టివాడి కోసమేనా నేనింతకాలం అన్వేషించింది? కళ్ళ నీరు గిర్రున తిరిగింది. అతనిపై ఏహ్యాభావం పుట్టింది. గిరుక్కున వెనుదిరిగి కారు దగ్గరికి వచ్చి లోపల కూర్చున్నాను.

వెళ్ళిపోదామనుకున్నదాన్నే అతను చేస్తున్న పని ఆత్మనింద కంటే ఏహ్యమైనదని చెప్పాలనిపించింది. అతనిపై మనస్సులో ఏర్పరచుకున్న భావం కూలిపోయేసరికి అతన్ని కఠినంగా నిందించి కసితీర్చుకోవాలనిపించింది.

ఒకపావు గంటకు అక్కడి నుంచి జనం వెళ్ళిపోయారు. అతను నా కారువైపే నడిచి వస్తున్నాడు కాని నన్ను గుర్తించలేదు. ఎవరో ఒక కుంటివాడు, గ్రుడ్డివాడు ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. అతను తిన్నగా వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు.

"బురఖా లేని వాళ్ళకు బువ్వ దొరకదురా! చేతిలో ఈ ఫ్లూటు లేకపోతే నాకీ డబ్బులు రావు. అంగవైకల్యంతో బాధపడే మీకు గాని నాకివెందుకు?" అని జేబులోని గుప్పెడు చిల్లర వాళ్ళ ఒళ్ళో పోశాడు. నేను నిర్ఘాంతపోయాను. నా హృదయం పశ్చాత్తాపంతో గగుర్పొడిచింది. అతను సంతృప్తిగా నవ్వుకుంటూ కారు ప్రక్కనుంచే కాలువవైపు వెళ్ళిపోసాగాడు.

నేనాశ్చర్యం నుంచి తేరుకొని, "ఇదిగో మిస్టర్!" అని పిలిచాను.

అతను వెనక్కు తిరిగి నా కారు దగ్గరికి వచ్చి, "మీరా డాక్టర్! నన్ను పలకరించే వాళ్ళీ లోకంలో ఎవరున్నారా అనుకున్నాను" అన్నాడు.

శకూ! ఒక వ్యక్తిని కలుసుకోవాలని ఉన్న తహతహ తీరా కలుసుకున్నాక ఏం మాట్లాడాలో తోచకుండా చేస్తుందేమో! నాకేం సమాధానమియ్యాలో తోచలేదు.

"మీకీ అనామకుని గురించి తెలుసుకోవాలని ఉంది కదూ?" నా కళ్ళల్లో నా భావాలు చదివినట్లే అనేశాడతను. నేను స్థాణువునే అయ్యాను.

"మీరిటువంటి దీనస్థితికెట్లా వచ్చారు? ఏదైనా ఉద్యోగం చూసుకోకపోయారా?"

పేలవంగా నవ్వాడు. "వ్యక్తిత్వం అమ్ముకునే ఉద్యోగం కంటే ఘోర పరాజయం పొందాను జీవితంలో. అయినా, నా కోసం నేను బాధపడే రోజులు కావివి. బాధల కతీతమయ్యే చోటుకు పోవాలని వృథా ప్రయత్నం చేస్తున్నాను. ఒక సామాన్య క్షుద్రజీవిని గురించి మీరు వివరాలు తెలుసుకోవాలనుకంటున్నారంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది డాక్టర్!... కాని, మీరు సంఘంలో ప్రముఖస్థానం వహించిన వ్యక్తులు. దానికి భంగం కలిగించటం ఉచితం కాదు. మీరిట్లా పబ్లిక్ రోడ్డు మీద నాతో అట్టేసేపు మాట్లాడడం మీకు మంచిది కాదు. అయినా, మీ ఉత్సుకతను నేను నిరుత్సాహపరిచాను. నాకు బుద్ధిపుట్టిననాడు ఏదో విధంగా నేనే మీ దగ్గరికి వస్తాను. తప్పకుండా మీకు నా వివరాలు చెప్తాను. సెలవ్!..."

రెండవసారి కూడా అతడు నా హృదయంపై విజయం సంపాదించాడు. అతని నమస్కృతికి ప్రతి నమస్కారం చేయలేని అచేతన స్థితిలోంచి తేరుకునేలోపలే అతను వెళ్ళిపోయాడు. అతని మాటలపై నాకు నమ్మకముంది. తప్పక అతడు నా దగ్గర కేదో ఒకనాడు వస్తాడనుకున్నాను.

క్రమంగా రోజులు గడిచిపోతున్నాయి. అతని తోటి పరిచయమే మాటిమాటికీ గుర్తుకు వస్తూండేది. అతని కోసం నిరీక్షించటం అలవాటైపోయింది.

కాని, అనుకోని విధంగా అతడు మళ్ళీ తారసపడ్డాడు. రెండు రోజులనాడు సాయంత్రం వేళ డిస్పెన్సరీకి వెడతున్నాను. ఒక వీధిలో ఆరేళ్ళ కుర్రాడు పరుగున వచ్చి నా కారు కడ్డంపడ్డాడు. నేను ఖంగారుగా బ్రేకు వేసి స్టీరింగ్ ప్రక్కకు తిప్పాను. సాధ్యమైనంతవరకు ఆపగలిగాను కాని అప్పటికే మడ్‌గార్డు ఒక వ్యక్తిని తాకి బోర్ల గిలపడవేసింది.

గబగబ పది మంది జనం మూగారు. నేను కారు దిగి ఆ గాయపడిన వ్యక్తి దగ్గరికి వెళ్ళాను. తీరా చూస్తే... అతనే! నా గుండె జల్లుమంది. నేను డాక్టరునని అక్కడివాళ్ళకు చాలామంది తెలుసు కనుక సరిపోయింది. లేకపోతే, నన్ను పబ్లిక్‌గా దుమ్మెత్తి పోసేవారేమో! అయినా అతని కాట్టే దెబ్బలు తగలలేదు - నా అదృష్టం కొద్దీ. తలపై చిట్లి రక్తం కారుతుంది. స్పృహ కోల్పోయాడు. ఫస్టెయిడ్ చేశాక నలుగురూ సాయం పట్టి నా కారులో వెనుక పరుండబెట్టారు. తిన్నగా హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాను. అతనికి ట్రీట్‌మెంట్ ప్రారంభించాను.

నిన్నటికి తేరుకున్నాడు. నిన్న సాయంత్రమే ఇంటికి తీసుకువచ్చాను. అతను గాఢంగా నిద్ర పోయినది ఈ సాయంత్రమే! అతను లేచాక డిస్పెన్సరీకి వెడదామని ఇక్కడే ఉండిపోయాను.

• • •

"అతని పేరు?" అని అడిగింది శకుంతల.

"ఏమో! ఎన్నిసార్లడిగినా చెప్పలేదు. నడు. లోపలికి వెళ్ళి చూద్దాము."

ఇద్దరం అతను పడుకున్న గదిలోకి వెళ్ళాము. అతనక్కడలేడు. ఆశ్చర్యపోయాను. కాని, డ్రాయరుపై పేపర్ వెయిట్ క్రింద గాలికి టపటప కొట్టుకుంటున్న కాగితం నాకంటె ముందు చూసిన శకుంతల "ఇందూ!" అని వెర్రి కేక పెట్టింది.

ఖంగారుగా ఆమెను సమీపించాను. ఆమె చేతిలోని కాగితం అందుకొని చూశాను. షాక్ తగిలినట్లయింది. మళ్ళీ ఇంకొకసారి చదివాను.

'డాక్టర్!

నా జీవితచరిత్ర తెలుసుకోవాలని మీకున్న కుతూహలానికి నా కృతజ్ఞత. నేను స్వయంగా మీకు చెప్పలేకపోయినా శకుంతల నడిగితే అంతా చెప్తుతుంది. అదృష్టజీవులకు నా నీడ

సోకినా ప్రమాదమేనని మీతో చెప్పకుండా వెళ్ళిపోతున్నందుకు క్షమించండి. దీనిని కృతఘ్నుతగా భావించకండి. మీ ఉదార హృదయానికి జోహారులు.

– ప్రభాకరం

శకుంతల గట్టిగా కళ్ళు మూసుకుని కుర్చీలో కూలబడిపోయింది. నా కతనిమాట లయోమయంగా ఉన్నాయి. నా మనస్సు గతంలోకి ఒక్కసారిగా చొచ్చుకుపోయింది.

శకుంతల ఆగర్భశ్రీమంతులింట పుట్టిన పిల్ల. కాలేజీలో చదువుకుంది. స్వతహాగా ధనవంతురాలననే అహంభావంతో ఉండేది. ఆమెకో బావ ఉన్నట్లు, అతనికి తల్లితండ్రులు లేక పోవటం వల్ల శకుంతల తండ్రే చదువు చెప్పించాడని నాకు తెలుసు. బి.ఎస్.సి. చదువుతున్నప్పుడు శకుంతల కొక ఫారెన్ రిటర్న్డ్ ప్రొఫెసర్ గారితో పెళ్ళయింది. కాని, పెళ్ళిముచ్చట పది కాలాల పాటు తీరకుండానే పెళ్ళయిన మరుసటి సంవత్సరం ఆమె భర్త విమానంలో ఢిల్లీ వెడుతూ ప్రమాదం వల్ల దుర్మరణం పాలయ్యాడు. కూతురు దీనస్థితికి కుమిలిపోయి హృద్రోగంతో ఆరు నెలలు తిరక్కుండానే తండ్రి మరణించాడు. అప్పటి నుంచి భర్త ఆస్తికి, తండ్రి ఆస్తికి యాజమానురాలు తానే అయి కన్యాశ్రమం నెలకొల్పి దేశసేవ చేస్తూ ఉండిపోయింది శకుంతల. ఆమె కనుసన్నలలో చిరుప్రాయం నుంచి పెరిగి ఆమెపై మమతలు పెంచుకున్న ఆమె బావ ఆమెకు పెళ్ళవగానే ఆ ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. తర్వాత శకుంతల జీవితం నరకప్రాయమైంది. నైతికంగా శ్రీమంతురాలే అయినా ఆమె విధి వైపరీత్యానికి గురియై కుమిలిపోయేది. కట్టుకున్న భర్త, కన్న తండ్రి దుర్మరణం పాలై ఆమె గుండెల్లో అగ్ని రగిల్చారు. ఆకాశ హార్మ్యాలు నిర్మించుకొని ఒక పెద్ద ప్రొఫెసర్ని పెళ్ళాడుతున్నాను కదా అనుకుంది. కాని, ఎట్ట ఎదుట రస హృదయ కమలాన్ని అర్పించిన బావను ఆమె మరిచిపోయింది. తరువాత పశ్చాత్తాపపడి తన హృదయం విప్పి చెప్పుకొని నా దగ్గర ఏడ్చింది. కాని, అప్పటికే కాలం మించి పోయింది. నా ఓదార్పు వల్లనే ఆమె తేరుకుంది. ఇప్పుడు కన్యాశ్రమ నిర్వహణం అంతా తన తలపై పెట్టుకొని అనేక మందికి విద్యాదానం చేస్తూ యాంత్రిక జీవితానికలవడిపోయింది శకుంతల.

గతమంతా ఎట్టఎదుట ప్రత్యక్షమై మనసులో ఒక అనుమానం కలిగింది. నెమ్మదిగా శకుంతలను సమీపించి, "అతను మీ బావేవిటే!" అన్నాను.

"ఊ!" శకుంతల వెక్కి వెక్కి ఏడుస్తూంది. నా అనుమానం నిజమైంది. నా హృదయంలోంచి ప్రియమైన వస్తువు నెవరో లాక్కుపోయినట్లు ఫీలయ్యాను. నా కళ్ళ వెంట నీళ్ళాగలేదు. కాని, శకుంతల దీనస్థితి నా వివేకాన్ని హెచ్చరించింది. ఆమెకు ధైర్యం చెప్పవల్సిన బాధ్యత నాపై ఉందని గుర్తించాను.

"శకూ! ఇప్పుడేడుస్తూ ఇక్కడ కూర్చుంటే ప్రయోజనమేముంది? అతని ఆరోగ్యం ఇంకా బాగుపడలేదు. అతని గాథ నీతో చెబుతున్నప్పుడే నిన్ను చూసి వెనుక వైపు నుంచి ఇల్లు వదిలి వెళ్ళిపోయి ఉంటాడు. వెంటనే పోలీసు రిపోర్టు ఇద్దాం! ఏదో దొంగతనం మోపితే

వెంటనే పట్టుకుంటారు. తర్వాత విడిపించి తీసుకువద్దాము. అతను ముఖ్యంగా ఈ ఊరు దాటి పోకుండా చూడాలి" అన్నాను.

వెంటనే శకుంతల లేచింది. ఇద్దరం కారులో బయలుదేరాము.

● ● ●

అంతవరకు చెప్పి ఆగింది డాక్టర్ ఇందిరా దేవి. మేమంతా నోళ్లు తెరుచుకొని ఆమె వైపు చూస్తూ ఉండిపోయాము. ఆమె గాఢంగా నిట్టూర్చి చిన్నగా నవ్వింది.

"తర్వాత ఏం జరిగింది?" అని ఆతృతగా అడిగింది మాలతి.

"ఏం జరిగి ఉంటుందో మీరూహించి చెప్పండి" అంది ఆవిడ.

ఎప్పుడో కాని ఇందిరాదేవికి ఖాళీ ఉండదు. ఆమెకీ ఆదివారం తీరుబడిగా ఉంది కదా అని మా స్నేహితులమంతా వాళ్ళింట్లో చేరాము. ఆమె చమత్కారంగా తన వైద్య జీవితంలోని సంఘటనలు మాకు చెప్పటం మామూలే! ఈ వేళ ఆమె చెబుతున్న గాథ ఆమె జీవితానికి సంబంధించినదని ఆమె మొదటే చెప్పటంతో చాల ఆసక్తిగా వినసాగాము. కాని, చిట్టచివర మమ్మల్నందర్నీ సస్పెన్సులో ముంచారావిడ. నాలుగు నిముషాల వరకూ ఎవ్వరం మాట్లాడలేకపోయాము.

"మీరు, శకుంతలగారు వెళ్ళి పోలీసు రిపోర్టిచ్చి ఉంటారు. ఎట్లాగో ఆయన్ను పట్టుకొని ఉంటారు. మీకాయనతో పెళ్ళయిందనుకోటానికి మీరింకా బ్రహ్మచర్య వ్రతంతోనే ఉన్నారు కదా! బహుశా మీ ప్రేమ త్యాగం చేసి వితంతు వివాహం దోషం లేదని ఒప్పించి శకుంతల గారితో ఆయన జీవితం ముడిపెట్టి ఉంటారు. నిజమేనా?" అంది రజని ఉత్సాహంగా. మేమంతా ఇందిరాదేవి కళ్ళల్లోకి చూశాము ఆసక్తిగా.

ఆమె కళ్ళల్లో నీళ్ళు చిలకటం నేను గ్రహించి స్తబ్ధత వహించాను. ఆమె ఏమి చెప్తుతుందా అని చెవులు రిక్కించుకుని కూర్చున్నాము.

"మీరంతా తల్లితండ్రుల పొత్తిళ్ళల్లోంచి ఇప్పుడిప్పుడే తలలెత్తుతూ ఈ లోకంలో నవ్వుల పువ్వు లేరుకుంటున్నారు కాని, దావానల ధూమగుచ్ఛాల నెరుగరు. అటువంటి నికృష్ట పరిస్థితులు ఎప్పటికీ మీ దరికి రాకూడదనే నా కోరిక" అని ఆగిందావిడ.

"ఇంతకూ..." అని నసిగింది తొందరపాటుతో మాలతి.

ఆమె పేలవంగా నవ్వి, "నిజంగా రజని అన్నట్లు అతను వస్తే తప్పకుండా నా ప్రేమ త్యాగంతో శకుంతల జీవితంలో నవ వసంతాలు నింపేదాన్ని. కాని.. కాని, మా ప్రయత్నాలు ఫలించలేదు. ఎంత డబ్బు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయింది. అతడు మాకు కనిపించలేదు. అప్పటికీ, ఇప్పటికీ అతను తిరిగి రాలేదు. ఆ మధురస్మృతి మాత్రం మిగిలింది" అని ఫోన్ వస్తే ఆవిడ లేచి వెళ్ళిపోయింది. చివర ఆమె కంఠం గాద్గదికమవటం అంతా స్పష్టంగా గుర్తించాము. కట్టుకున్న పేక మేడలేవో కూలిపోయినట్లయింది మాకు. బరువెక్కిన హృదయాలతో అట్లాగే కుర్చీల కతుక్కుపోయాము. ●